క్లుప్తంగా

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి



ఎంపీ శ్రీధర్‌కు మొక్కను అందజేస్తున్న పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు

ద్వారకాతిరుమల : భగవంతుడికి సేవ చేసుకునే అదృష్టం కలగడం పూర్వజన్మ సుకృతమని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఇటీవల శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేసిన ద్వారకాతిరుమలకు చెందిన పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, ఆమె భర్త జ్యోతి శ్రీనివాస్ మంగళవారం ఎంపీని ఏలూరులోని ఆయన నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువాను కప్పి, మొక్కను, పూలబొకేను అందించారు. అనంతరం ఎంపీ శ్రీధర్ ట్రస్టుబోర్డు సభ్యురాలు పద్మను అభినందించారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ప్రతాపనేని వాసు ఉన్నారు.

పుల్వామా వీరులకు ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు, యువకులు

కుక్కునూరు : పుల్వామా జిల్లాలో భారత బలగాలపై ఉగ్రవాదులు చేసిన దాడిలో అమరులైన సీఆర్పీఎఫ్ జవాన్లను స్మరించుకుంటూ మంగళవారం కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో మాజీ సైనికులు, యువకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రదాడిలో దేశం కోసం ప్రాణాలర్పించిన 40 మంది వీరసైనికుల త్యాగాలను దేశం మర్చిపోదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు కుక్కునూరు బాపిరాజు, ములిశెట్టి నరేష్, కరేటి అప్పారావు, మంత్రి గోపాల క్రిష్ణ, ములిశెట్టి యుగంధర్, పిచ్చుక రాజు, నిరంజన్, నాగరాజు, జక్కుల రామక్రిష్ణ, జగదీశ్, సమయమంతుల లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గోవులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



గోవులను తరలిస్తున్న వ్యాన్లు

జంగారెడ్డిగూడెం: గోవులను తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో మంగళవారం తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు వ్యాన్‌లలో 40 గోవులను ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. వ్యాన్‌లను సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. గోవులను రాజమండ్రి గోశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ పోటీలకు కస్తూర్బా బాలికలు

ఏలూరు రూరల్: జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరు కస్తూర్బా పాఠశాల బాలికలు ఎంపికయ్యారు. ఈ నెల 11వ తేదీ నుంచి 13 వరకు విజయవాడ సిద్దార్థ కళాశాలలో నిర్వహించిన 66వ రాష్ట్ర స్థాయి అండర్–17 అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఏలూరు కస్తూర్బా స్కూల్ బాలికలు పి.జయశ్రీ, ఎస్.రేణుక రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం జి.సునీత తెలిపారు. వీరిద్దరూ త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ కె.మురళీకృష్ణ వివరించారు. 10 రోజుల క్రితం ఇదే స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు అండర్–14 బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన విషయం తెలిసిందే.

మనసుని జయించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మానవుడు తన మనస్సును జయిస్తే సకల జగత్తునూ జయించినట్లేనని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు సేవాకేంద్రం నిర్వాహకురాలు బీకే లావణ్య అన్నారు. స్థానిక శ్రీరామ్ నగర్‌లోని బ్రహ్మకుమారి సేవా కేంద్రంలో మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను మంగళవారం పలువురు విద్యార్థినులు దర్శించుకున్నారు. వారితో లావణ్య మాట్లాడుతూ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టుకోవాలని, రాజయోగాభ్యాసం ద్వారా ఇది సాధ్యమౌతుందని అన్నారు. నిత్యం సాయంత్రం మానసిక ఒత్తిడిని జయించేలా, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీకే సుధారాణి, బీకే మమత, బీకే హిమబిందు, బీకే బాలాజీ, బీకే లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

గృహ సారథులే.. విజయ సారథులు

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- ధర్మాజీగూడెంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ



గృహసారథుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా



సమావేశానికి హాజరైన గృహసారథులు, కన్వీనర్లు

లింగపాలెం : గృహసారథులే రేపటి విజయ సారథులని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. ధర్మాజీగూడెం కళ్యాణమండపంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా లింగపాలెం మండల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ గృహసారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి గృహస్తులను కలసి ప్రతిపక్షాల కుట్రాలు, వారి పాలనలోని వైఫల్యాలను తెలియజేయాలన్నారు. సీఎం జగన్‌మోహనరెడ్డి నవరత్నాల ద్వారా నూటికి 85 శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికే సాధ్యమన్నారు. దోపిడిదారులంతా ఒక పక్క ఉంటే పేదల పక్షాన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒంటరిగా పోరాటం చేస్తున్నారని ఎలీజా అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుంటే సోమరిపోతులను చేస్తున్నారంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు తన హయాంలో ఏనాడైనా పేదలకు సంక్షేమ పథకాలు అందించారా ..అని ప్రశ్నించారు. మహిళలను చంద్రబాబు నమ్మించి మోసం చేశాడని విమర్శించారు. చంద్రబాబుతోపాటు, తన దుష్ట చతుష్టయం వత్తాసు పాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. జగన్ పాలనలో ప్రతి పేదోడికి సంపూర్ణ న్యాయం జరుగుతుందని, ఈ పాలనను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ ముందు కూడా అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని.. అందుకు మీరంతా సమన్వయంతో పనిచేయాలని ఎలీజా పిలుపునిచ్చారు. పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా గృహసారథులు, కన్వీనర్లు కష్టపడి పనిచేయాలని ఎలీజా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు, మండల సచివాలయాల ఇన్‌చార్జి అన్నపనేని శాంతరావు, మండల వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ధర్మాజీగూడెం సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్, గ్రామ సర్పంచ్‌లు కొత్తూరి మౌనిక, ఇనుగంటి రాజేష్‌బాబు, తాడేపల్లి శాంతరావు, రవీంద్ర, కె రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు రావి కొండయ్య, మేకల రాజు, కర్లపూడి ఆనంద్, సొంగా సందీప్, నూతలపాటి శ్రీను, ఎం సుమన్ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి స్కానింగ్ పరీక్షలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో మంగళవారం లివర్ సంబంధిత వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రజా వైద్యశాలలో వైద్యులు కోట సుబ్బారావు ఆధ్వర్యంలో 150 మందికి స్కానింగ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ మనిషి శరీర అవయవాల్లో ముఖ్యమైన వాటిలో లివర్ ఒకటని, నేటి పరిస్థితుల్లో దానిపై శ్రద్ధ అవసరం అన్నారు. రూ. 4వేలు విలువైన లివర్ పరీక్షలను తెల్ల రేషన్ కార్డుదారులకు రూ.200కే నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ల్యాబ్స్ మేనేజర్ గెల్లా ప్రసాద్, ప్రజా వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న వెంకన్నబాబు

ద్వారకాతిరుమల : మండలంలోని పి.కన్నాపురంలో గత మూడు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు బొండాడ వెంకన్నబాబు గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలతో పాటు ట్రోఫీలను అందజేశారు. క్రీడల్లో మరింతగా రాణించాలని వారిని ప్రోత్సహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటీసులు అందుకున్నవారు పన్నులు చెల్లింపు

జంగారెడ్డిగూడెం : ఆస్తి పన్ను బకాయిదారులలో కొంతమంది స్పందించి మంగవారం చెల్లింపులు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. రెడ్ నోటీస్ ఇచ్చిన ఆస్తి పన్ను బకాయిదారుల వద్దకు రెండవ రోజు కూడా మున్సిపల్ అధికారులు వెళ్లి బకాయిలు చెల్లించమని కోరారు. ఈ క్రమంలో కొంత మంది స్పందించి నగదు, చెక్కు రూపంలో చెల్లింపులు చేసినట్లు కమిషనర్ తెలిపారు. నోటీసులు అందుకున్న వారితో పాటు, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకనూ ఆస్తి, కుళాయి తదితర పన్నులు చెల్లించని వారు వెంటనే పన్నులు చెల్లించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎన్.సుబ్బారావు, మేనేజర్ కె.వెంకటరమణ, టౌన్‌ప్లానింగ్ వి.జగదీశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ పి.సంధ్యారాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్య జీవనం

కొయ్యలగూడెం : బయ్యన్నగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ మేళాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డా.కె.విజయకృష్ణ ఆధ్వర్యంలో హెల్త్ మేళా గురించి ప్రజలకు వివరించారు. 'సైకిల్ ఫర్ హెల్త్' అనే నినాదంతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతు సైకిల్ తొక్కడం వలన కండరాలకు బలం చేకూరి శరీర బరువు తగ్గుతుందని, గుండె, ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయని, అధిక రక్తపోటు, మధుమేహాన్ని తగ్గిస్తుందని, దీంతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. ప్రజలందరు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడానికి ప్రతి నెల 14వ తేదీన జరిగే ఈ హెల్త్ మేళా కార్యక్రమానికి రావల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.ప్రదీప్తి, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.రమేష్, పీహెచ్‌ఎన్ జి.మేరీ గోల్డ్, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బయ్యనగూడెంలో హెల్త్ మేళాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చింతలపూడిలో సైకిల్ యాత్ర

సైకిల్ ప్రదర్శన

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ సచివాలయం–3 లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌వీఎస్ కాలనీలో సైకిల్ ప్రదర్శన నిర్వహించారు. ప్రతి రోజూ సైకిల్ తొక్కడం వల్ల అధిక బరువు తగ్గడం, గుండె సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం పొందెందుకు అవకాశం ఉంటుందని వైద్య సిబ్బంది తెలిపారు. నడక వల్ల శారీరక వ్యాయామంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చునని చెప్పారు. అనంతరం రోగులకు జ్వరం, మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. శిబిరంలో యర్రగుంటపల్లి పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్‌లు సయ్యద్ జఫ్రుల్లా, కె దిలీప్, విజయనిర్మల, ఆశ వర్కర్లు శ్యామల, పుణ్యవతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి విశ్వబ్రాహ్మణ సంస్కృతిపై శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు వైశ్వకర్మణ వైదిక చరిత్ర త్రికాల సంధ్యావందనం సంస్కృతి సంప్రదాయాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఏపీ విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం కన్వీనర్ అప్పలభక్తుల శివకేశవరావు, సభ్యులు ముళ్లపూడి రాజా తెలిపారు. ఏలూరు పవరుపేటలోని కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో 15న ఉదయం 9 గంటలకు శిక్షణను బ్రహ్మశ్రీ చంద్రపాటి నాగవరప్రసాదరావు ప్రారంభిస్తారని, నిత్యం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో శాంతిస్థాపన

జంగారెడ్డిగూడెం : ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక భావనలు పెంపొందాలని, అప్పుడే సమాజంలో శాంతి, సౌఖ్యాలు నెలకొంటాయని ఏలూరు నగర శ్రీ బసవేశ్వర కర్ణభక్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిద్దాని నాగ సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పొన్న కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అల్లం సర్వేస్వరరావు అన్నారు. ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ వాసా రామకృష్ణారావును మంగళవారం జంగారెడ్డిగూడెంలో వారు కలసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామకృష్ణారావుకు లభించిన గౌరవం కర్ణభక్తులందరికీ లభించిన గౌరవం అన్నారు. కర్ణభక్తులు రాజకీయంగా అభివృద్ధి చెందాలని అందుకు అనుగుణంగా ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ సభ్యులతోపాటు జంగారెడ్డిగూడెం సంఘం కార్యదర్శి వాసా కోటేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ వాసా రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

కన్వీనర్లకు దిశా నిర్దేశం చేయండి

కొయ్యలగూడెం : నూతనంగా నియమితులైన, జగనన్న మండల కోఆర్డినేటర్, సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు దిశా నిర్దేశం చేసి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీ మిథున్ రెడ్డి పేర్కొన్నట్లు గంజిమాల దంపతులు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని ఎంపీ మిథున్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్లు ఎంపీపీ గంజి మాల రామారావు, పశ్చిమ డెల్టా బోర్డు చైర్ పర్సన్ గంజి మాల దేవి పేర్కొన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశానికి దిక్సూచిగా నిలబడిందని అదే తరహాలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల నియామకంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టను మరింత పెంచాలని కోరారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పోలవరం నియోజకవర్గంలో అమలు గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బాలరాజు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని పోలవరం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జిగా ఆడపడుచుల అభిమానం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అందింపచేయాలని కోరారని గంజిమాల దేవి తెలిపారు.



ఎంపీ మిథున్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గంజి మాల దంపతులు

బ్యాంక్ మేనేజర్‌పై హత్యకేసు నమోదు చేయాలి

ఏలూరు (టూటౌన్): ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన గంగుల రాటాలు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సంబంధించి స్టేట్ బ్యాంకు మేనేజర్‌పై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన మద్దిపాటి సత్యనారాయణ అనే రైతు స్టేట్‌బ్యాంక్‌లో రూ.3 లక్షల పంట రుణానికి రాటాలు హామీ సంతకం పెట్టాడని తెలిపారు. సత్యనారాయణ రుణం చెల్లించకపోవడంతో హామీ ఉన్న రాటాలుపై బ్యాంకు సిబ్బంది ఒత్తిడి చేసి ఖాతాను నిలిపివేశారని పేర్కొన్నారు. రాటాలు చిన్న కుమార్తె క్యాన్సర్‌తో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బులు ఇవ్వమని బ్యాంకు మేనేజర్‌ను ప్రాధేయపడినా నిర్లక్ష్యంగా గెంటివేయడంతో మనస్థాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. రాటాలు కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభాకర్ కోరారు. మృతుని కుటుంబానికి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నేటి నుంచి శివయ్య కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల : క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివయ్య కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకుగాను దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా 15న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెలను చేస్తారు. అలాగే 16న సాయంత్రం ధ్వజారోహణ, 17న సాయంత్రం గ్రామోత్సవం, 18న శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణం, అనంతరం గ్రామోత్సవం, 19న స్వామి వారికి అభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చన, సాయంత్రం గ్రామోత్సవం, 20న ఉదయం త్రిశూలవారి వసంతోత్సవం, గ్రామోత్సవం, ధ్వజ అవరోహణ జరుగుతాయి. అలాగే 21న రాత్రి జరిగే ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని, భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు కోరారు.



ద్వారకాతిరుమలలో ముస్తాబైన క్షేత్రపాలకుని ఆలయం

నేడు శిక్షణ తరగతులు

కొయ్యలగూడెం : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు, వలంటీర్లకు బుధవారం శిక్షణ నిర్వహిస్తున్నట్లు జగనన్న సచివాలయాల మండల కో–ఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు హాజరవుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి మండల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



పోలవరంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : ప్రకృతి వ్యవసాయంపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని మండల మాస్టర్ ట్రైనర్ ఎంవీ జోతిర్మయి అన్నారు. పోలవరంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల ఆరోగ్యానికి హానికరం అని, ప్రకృతి వ్యవసాయంపై పంటలు పండించాలన్నారు. ప్రకృతిలో దొరికే వేప నూనె, వివిధ రకాల ఆకులతో తయారు చేసిన ఎరువులను పంటలకు ఉపయోగిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ముద్దు, రసాయనిక వ్యవసాయం వద్దు అని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి యు.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దామోదర సంజీవయ్య జయంతి

జంగారెడ్డిగూడెం : స్థానిక దామోదర సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం దామోదర సంజీవయ్య 102వ జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ బోపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా సంజీవయ్య అమలు పరిచిన వృద్ధాప్య పింఛన్ పథకం, ఆయన ఏర్పాటు చేసిన అవినీతి నిరోధక శాఖను ఇప్పటికీ దేశంలో చాలా రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. నిస్వార్థమైన సేవ, నిడారంబరతతో ప్రజల మనసు గెలుచుకున్న ప్రజానాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దామోదర సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మోటార్‌సైకిల్ చోరీపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న నిమ్మల సుబ్బారావు గత నెల 21న గంగానమ్మ గుడి సెంటర్‌లో తన మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసి, పని నిమిత్తం వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి వచ్చి చూడగా, పార్క్ చేసిన మోటార్‌సైకిల్ కనిపించలేదని, దీంతో అప్పటి నుంచి మోటార్ సైకిల్ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చైన్ స్నాచింగ్‌పై స్పందనలో ఫిర్యాదు.. కేసు నమోదు

ద్వారకాతిరుమల: గొల్లగూడెంలో జరిగిన చైన్‌స్నాచింగ్ ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. ద్వారాకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మహదేవపురానికి చెందిన వృద్ధురాలు పిల్లి వరలక్ష్మి తన మనుమరాలు గౌతమి ప్రియతో కలిసి ద్వారకాతిరుమల మండలం రామన్నగూడెంకు వెళ్లేందుకు గత ఏడాది అక్టోబర్ 17న ఉదయం భీమడోలు బస్టాండ్‌కు చేరుకుంది. బస్ కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి తాము ద్వారకాతిరుమల వెళుతున్నట్లు చెప్పి వారిని బైక్ ఎక్కించుకున్నారు. మండలంలోని గొల్లగూడెం వద్దకు వచ్చేసరికి వారు బైక్‌ను ఆపి వరలక్ష్మి, ఆమె మనుమరాలిని కిందకు దిగమన్నారు. బైక్ దిగిన వెంటనే అకస్మాత్తుగా ఆ ఇద్దరు వ్యక్తులు వృద్ధురాలి మెడలోని మూడున్నర కాసుల బంగారు నానుతాడు, సూత్రాలు, మరో రెండున్నర కాసుల నల్లపూసల గొలుసును లాక్కొని బైక్‌పై ఉడాయించారు. అయితే భయాందోళనకు గురైన వృద్ధురాలు ఆ సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని తెలిసి ఈ నెల 13న స్పందనకు ఆమె వెళ్లగా, అక్కడి అధికారుల సూచనలు మేరకు ఆమె తిరిగి మంగళవారం ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. జరిగిన ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన కుమారుడిని అప్పగించిన పోలీసులు

బుట్టాయగూడెం: నాలుగేళ్ల క్రితం తప్పిపోయిన తమ కుమారుడిని పోలీసులు ఆచూకీ కనుగొని తీసుకువచ్చి అప్పగించడంతో ఆ కుటుంబ సభ్యులు ఆనందానికి అవధుల్లేవు. వివరాలిలా ఉన్నాయి. బుట్టాయగూడెం మండలం నందాపురానికి చెందిన నారెం దుర్గారావు కుమారుడు నారెం నాగేంద్ర 2019 మే 13వ తేదీన ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడు. అయితే అతని ఆచూకీ కోసం తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అందరి ఇళ్లలో వెతకడంతో పాటు ప్రతీ చోటా అన్వేషించారు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం వైజాగ్‌లోని అరకు దగ్గరలో ఉన్న సుంకరమెట్ట అనే గ్రామంలో ఉన్నట్లు ఆచూకీ తెలుసుకుని అక్కడికి వెళ్లి నాగేంద్రను బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. మంగళవారం నాగేంద్రను ఎస్సై ఎం.జయబాబు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. తప్పిపోయాడనుకున్న నాగేంద్రను తీసుకువచ్చి అప్పగించినందుకు పోలీసులను పలువురు అభినందించారు.

ముగ్గురు మహిళల అరెస్టు.. 17 లీటర్ల సారా స్వాధీనం

చింతలపూడి: చింతలపూడి, లింగపాలెం మండలాల్లో మంగళవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు మహిళలు, ఒక వ్యక్తిని అరెస్టు చేసి వారి నుంచి 17 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సిఐ సాయి స్వరూప్ చెప్పారు. చింతలపూడి మండలం, రేచర్ల, పోతునూరు గ్రామాలకు చెందిన పులి శ్రీదేవి, అలగాని సుబ్బలక్ష్మి, ఎం.లక్ష్మీదేవిలను అరెస్ట్ చేశామన్నారు. అలాగే లింగపాలెంలో పబ్బు వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.